పల్లెల్లో నీటి ఎద్దడి ఉండొద్దు

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

కలెక్టర్‌కు వాటర్ గ్రిడ్ గురించి వివరిస్తున్న డీఈ సాయి

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 7: గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. మండంలోని తోగ్గూడెంలో భగీరథ వాటర్ గ్రిడ్‌ను ఆదివారం ఆమె పరిశీలించారు. డీఈ సాయి నుంచి వివరాలు తెలుసుకున్నారు. పల్లెల్లో నీటి ఎద్దడి ఏర్పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డితో చెప్పారు. అన్ని ప్రాంతాలకు నీరందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈఈ తిరుమలేష్, ఇంట్రా విలేజ్ డీఈ శివయ్య తదితరుల పాల్గొన్నారు.

కేటీపీఎస్ క్రీడాకారులకు సన్మానం

విజేతలతో అధికారులు

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 7: హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రలో మార్చి 29 నుంచి 31 వరకు జరిగిన జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో కేటీపీఎస్ కర్మాగారం 5,6,7 దశల క్రీడాకారులు క్యారమ్స్, చెస్, లాన్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్‌లో విజయం సాధించారు. వారిని ఆదివారం చీఫ్ ఇంజినీర్లు పి.వెంకటేశ్వరావు, ఎం.ప్రభాకర్‌రావు, కె.శ్రీనివాస్‌బాబు ఆదివారం కర్మాగారంలోని కళావేదికలో సన్మానించారు. అధికారులు యుగపతి, శేఖర్, వై.వెంకటేశ్వర్లు, టి. వీరాస్వామి పాల్గొన్నారు.

నాలుగు ఉద్యోగాల విజేతకు సన్మానం

సన్మానం అందుకుంటున్న సుధారాణి

చర్ల, ఏప్రిల్ 7: ఒకేసారి నాలుగు ఉద్యోగులకు ఎంపికైన చర్లకు చెందిన మద్ది సుధారాణిని స్వేచ్ఛ ప్రెస్‌క్లబ్ బాధ్యులు, సీడీపీవో చైతన్య ఆదివారం సన్మానించారు. ఉద్యోగార్థులకు స్ఫూర్తిగా నిలిచిన సుధారాణిని అభినందించారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాలయం ప్రిన్స్‌పాల్ వర్మ, భద్రాద్రి డిగ్రీ కాలేజి ప్రిన్స్‌పాల్ కొండలరావు, ఆర్ఐ వరలక్ష్మి, ఉపాధ్యాయులు జవ్వాది నరేందర్, మామిడి భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల ఘర్షణపై విచారణ జరిపించాలి

మాట్లాడుతున్న ఈసం నాగలక్ష్మి

టేకులపల్లి, ఏప్రిల్ 7: పోడు భూముల విషయంలో గిరిజనులకు, పోలీసులకు జరిగిన ఘర్షణపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని భారతీయ సర్వ సమాజ్ మహా సంఘం జిల్లా మహిళ అధ్యక్షురాలు ఈసం నాగలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సత్తుపల్లి పోడు భూముల రైతులపై పోలీసుల దాడిపై ఉప ముఖ్యమంత్రి భట్టి అనుచరుడు, కాంగ్రెస్ నాయకుడు మద్దిశెట్టి సామియేలుపై అక్రమ కేసుల విషయంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సూరే సీతారాములు, పడిగ ఎర్రయ్య, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

CHANGE OF NAME

★I,GOGGELA HANUMANTHA RAO (old name) R/o. H.No.5-99, 3 incline, Chunchupally, Kothagudem, Bhadradri Kothagudem Dist, Telangana, changed my name as MUPPIDI HANUMANTHA RAO (NEW NAME) S/o. MUPPIDI CHANDRAIAH
KMM

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

దశలవారీ ఆందోళనలకు సింగరేణి అధికారులు

తీర్మానించిన అసోసియేషన్

మాట్లాడుతున్న మణుగూరు ఏరియ జీఎం దుర్గం రామచందర్

మణుగూరు టౌన్, ఏప్రిల్ 7: సింగరేణి బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సహకరిస్తూనే, తమ సమస్యల పరిష్కారానికి అధికారులు దశలవారీ ఆందోళనలకు సిద్ధం కావాలని కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంవోఏఐ) సింగరేణి శాఖ ఏకగ్రీవంగా తీర్మానించింది. మణుగూరు ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో ఆదివారం పీకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్, సీఎంవోఏఐ అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ అధ్యక్షతన నూతన కమిటీ ప్రథమ సమావేశం జరిగింది. సింగరేణి అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించింది. మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ మాట్లాడుతూ.. సమస్యలను సముచిత రీతిన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే పరిష్కారమవుతాయని అన్నారు. సబస్యల పరిష్కారానికి యాజమాన్యం సానుకూలంగా ఉందన్నారు. ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు, ఉపాధ్యక్షులు పొనుగోటి శ్రీనివాస్, రాజీవ్‌కుమార్, సంయుక్త కార్యదపర్శులు డాక్టర్ కిరణ్‌రాజ్, సిహెచ్.రాజగోపాల్, కోశాధికారులు విజయగిరి నరేష్, బి.రాజగోపాల్, ఏరియా అధ్యక్షుడు కోడి కృష్ణమూర్తి, సభ్యులు ఎండి.మదార్‌సాహెబ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉగాది ఉత్సవాలు

ఉగాది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న పాల్వంచ కళాపరిషత్ బాధ్యులు

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 7: పాల్వంచలోని వేణుగోపాల్ థియేటర్ ఆవరణలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ఉగాది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పాల్వంచ కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి వేముల కొండల్ రావు తెలిపారు. ఈ ఉత్సవాల పోస్టర్‌ను బాధ్యులు ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పేరు గాంచిన కళాకారులు, మిమిక్రీ కళాకారుడు సిల్వర్ స్టార్ ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మహీపతి రామలింగం, కళాపరిషత్ బాధ్యులు మంతపూరి రాజా గౌడ్, డాక్టర్ నామా బుచ్చయ్య, చలువాది ప్రకాష్, గొర్రెపాటి రమేష్, లింగమూర్తి, ముగిది శ్రీనివాస్, లక్ష్మినారాయణ, సందీప్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రం ప్రారంభిస్తున్న సీఐ రాజువర్మ

చర్ల, ఏప్రిల్ 7: పాత చర్ల గాంధీసెంటర్‌లో బీఆర్ఎస్ కార్యకర్త దనుకొండ చిన్నారి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ రాజువర్మ ఆదివారం ప్రారంభించారు. ఎస్సై సూరి తదితరులు పాల్గొన్నారు.

బెండాలపాడు అడవిలో జంతువుల వేట

ఫారెస్ట్ అధికారుల అదుపులో ఆరుగురు వేటగాళ్లు

బెండాలపాడు అటవీప్రాంతం

చండ్రుగొండ, ఏప్రిల్ 7: మండల పరిధిలోని బెండాలపాడు అటవీ ప్రాంతంలో జంతువులను వేటాడేందుకు వచ్చిన ఆరుగురిని అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. స్థానికులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సుగ్రీవ్, నారాయణరావు, వెంకటశ్రీకాంత్, విజయనాగరాజు, చండ్రుగొండ మండలానికి చెందిన బొర్రా సురేష్, మిధున్‌లు కలిసి వాహనంలో బెండాలపాడు అటవీ ప్రాంతంలోని కనిగిరి గుట్టల్లో శనివారం అర్ధరాత్రి నుంచి జంతువులను వేటాడుతున్నారు. పక్కా సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు తెల్లవారుఝామున(ఆదివారం) దాడి చేసి వేటగాళ్లను, ఓ తుపాకీని అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ రేంజ్ కార్యాలయానికి తరలించారు. వీరిపై అటవీశాఖలోని పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయమై గట్టుగూడెం డిప్యూటీ రేంజ్ ఆఫీషర్ వెంకట రామారావును వివరణ కోరగా.. విచారణ చేస్తున్నామని పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. అయితే జంతువులను వేటాడే క్రమంలో పట్టుబడ్డ వారిలో చండ్రుగొండ మండలానికి చెందిన అధికార పార్టీ మద్దుకూరు ఎంపీటీసీ భర్త, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బొర్రా సురేష్ ఉండటం గమనార్హం. జంతువుల వేట జరుగుతున్నా అటవీశాఖ అధికారులు నోరు మెదపకపోవడంపై అధికార పార్టీకి చెందిన నాయకుల ఒత్తిడి ఉందనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

టేకులపల్లి, ఏప్రిల్ 7: అక్రమంగా తరలిస్తున్న కలపను ఫారెస్టు అధికారులు పట్టుకున్న ఘటన కోటల్ల గ్రామంలో చోటు చేసుకున్నది. రోళ్లపాడు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ తేజావత్ రంగ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తొమ్మిదో మైలుతండా పంచాయతీ రోళ్లపాడు ఫారెస్టు సెక్షన్ కోటల్ల గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున ఫారెస్టు ఎఫ్ఆర్‌వో బీవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో దాడిచేసి కలపను, ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. పట్టుబడిన వి.పాపయ్యను విచారించగా పరారిలో ఉన్న భూక్యా గన్య, భద్రు, ప్రభాకర్, రవిగా తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను, కలపను జీటీడీ ఇల్లెందు తరలించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఫారెస్టు అధికారులు ఎఫ్ఆర్‌వో ప్రసాద్, రోళ్లపాడు సెక్షన్ ఆఫీసర్ తేజవత్ రంగ్య, డీఆర్‌వోలు రాంసింగ్, సాల్మన్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు .. ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు

వాహనదారులు లేక బోసిపోయిన ఎర్రగుంట జాతీయ రహదారి

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 7: మండలంలోరోజు రోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో భానుడు భగ భగ మంటున్నాడు. ఉదయం 7గంటల నుంచే సూర్యుడు మండిపడుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలో ఆదివారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో వడగాల్పులతో పిల్లలు పెద్దలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మధ్యాహ్నం రోడ్లపై వాహనాల రద్దీ కూడా తగ్గుతోంది. ముఖ్యంగా నిత్యం అనేక వాహనాల రాకపోకలు సాగించే ఎర్రగుంట జాతీయ రహదారి బోసిపోయి కనిపించింది. ఉదయం 11 గంటలు అయ్యిందంటే చాలు బయటకు రావడానికి జనం జంకుతున్నారు. ప్రయాణాలను ఉదయం లేదా సాయంత్రానికి మార్చుకుంటున్నారు. అత్యవసరమైతే తప్పా బయటికి రావడం లేదు. వడదెబ్బకు గురికాకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

జాతీయ రహదారిపై విరిగిపడిన భారీ వృక్షం

వాహనాల రాకపోకలకు అంతరాయం

జాతీయ రహదారిపై పడిన భారీ వృక్షం

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 7: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జాతీయర రహదారిపై ఆదివారం తెల్లవారుజామున భారీ వృక్షం విరిగిపడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారి పక్కన ఉన్న వృక్షం మొదలు పుచ్చిపోవడంతో చెట్టు రహదారికి అడ్డంగా విరిగిపడగా ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. తెల్లవారు జాముకావడంతో సుమారు రెండు గంటలపాటు జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలకు అంతరాయం ఏర్పడింది. సమచారాం తెలుసుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో చెట్టును తొలగించి రాకపోకలను యథావిధిగా సాగేలా చర్యలు తీసుకున్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

దమ్మపేట, ఏప్రిల్ 7: నియోజవర్గస్థాయి దిలీప్, అప్పారావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ మండలంలో అంకంపాలెంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలను దిలీప్ తల్లిదండ్రులు సులేమాన్, మంగ, అప్పారావు తనయుడు పవన్‌లతో కలిసి జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. తొలి మ్యాచ్ నాగుపల్లి, మందలపల్లి జట్ల మధ్య జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కుమారుడు శ్రీకాంత్, ఎంపీపీ సోయం ప్రసాద్, పైడి సాయి తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు చీరెల పంపిణీ

చీరెలు పంపిణీ చేస్తున్న దాతలు

ఇల్లెందు, ఏప్రిల్ 7: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన ప్రముఖ కూరగాయల వ్యాపారి దివంగత యాకుబ్ కుమారులు జానీ, గౌస్‌లు ఆదివారం వారి స్వగృహంలో 300 మంది నిరుపేద ముస్లిం మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ఖురాన్‌లో పేర్కొనట్లు ప్రతి ఒక్కరూ తన సంపాదనలో కొంత భాగాన్ని నిరుపేదలకు దానం (జకాత్) చేయాలన్నారు. రంజాన్ మాసంలో ప్రతి కుటుంబం చల్లగా ఉండాలని అకాంక్షించారు.

రంజాన్ తోఫా అందజేత

కొత్తగూడెం అర్బన్: తోఫా అందుకుంటున్న ముస్లింలు

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 7: స్థానిక పెనగడప గ్రామంలోని సుమారు వంద మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను తాండ్ర నారాయణరావు (టీఎన్ఆర్) ట్రస్ట్ సభ్యుడు తాండ్ర నాగబాబు ఆదివారం అందించారు. సభ్యులు పాల్గొన్నారు.

కరకగూడెంలో..

కరకగూడెం: రంజాన్ తోఫా అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కరకగూడెం, ఏప్రిల్ 7: దాదాపు 50 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ (సికింద్రాబాద్) సభ్యుడు షేక్ సోండ్‌పాషా ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సారపాకలో..

సారపాక: తోఫా అందజేస్తున్న జమాతే ఇస్లామి హింద్ బాధ్యులు

సారపాక, ఏప్రిల్ 7: స్థానిక సాజిదా మసీదులో పేద ముస్లిం కుటుంబాలకు తోఫాలను జమాతే ఇస్లామిక్ హింద్ బాధ్యులు ఆదివారం పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు ఇషాక్, ప్రధాన కార్యదర్శి జహీర్‌పాషా, సభ్యులు షేక్ అబ్దుల్ సలీమ్, బాషరత్, నాగూర్‌వలీ, సైదుద్దీన్, సిలార్, పాషా తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక

మల్లవరపు రాజేశ్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7: తెలంగాణ పంచాయతీరాజ్(పీఆర్) మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీని ఆదివారం జరిగిన సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షుడిగా మల్లవరపు రాజేష్ (జూనియర్ అసిస్టెంట్, జడ్పీ), ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాస్ (సూపరింటెండెంట్, జడ్పీ), మరికొందరు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా రామారావు (ఎంపీడీవో), శ్రీనివాస్ (ఎంపీడీవో), ఆంజనేయులు (ఏఈ) వ్యవహరించారు. నూతన కమిటీని టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు, పీఆర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ అంకబాబు, జిల్లా కన్వీనర్ మామూనురు రాజేష్ అభినందించారు.

రామయ్యకు స్వర్ణ పుష్పార్చన

భద్రాచలం, ఏప్రిల్ 7: భద్రాచలం సీతారామచంద్రస్వామి దివ్య క్షేత్రం అంతరాలయంలో మూలవరులకు అర్చకులు ఆదివారం 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

కవులు, గాయకుల సమ్మేళనం

భద్రాచలం, ఏప్రిల్ 7: కవితలు, పాటలతో కవులు, గాయకులు ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సందడి చేశారు. 'కవితా వసంతం' పేరిట ఈ కార్యక్రమాన్ని తెలంగాణ సాహితి నిర్వహించింది. చిరంజీవి సాయి అక్షిత సాంప్రదాయ నృత్యం, వాణీరాం గానంతో కార్యక్రమం ప్రారంభమైంది. కనకదుర్గ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాల్యశ్రీ, కేవీవీఎస్ మూర్తి, భూషణరావు, జేఆర్ మూర్తి, దుర్గా కోమలి, జె.నాగమణి, వై.అనూష, సోంపాక సీత, తాతోలు దుర్గాచారి పాల్గొన్నారు.

'మాదిగలకు అన్యాయం'

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 7: ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థులుగా ఒక్క మాదిగకు కూడా కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోవడాన్ని మాదిగ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోగుదు జోగారావు ఒక ప్రకటనలో తప్పుబట్టారు. కనీసం కంటోన్మెంట్ ఉప ఎన్నిక అసెంబ్లీ టికెట్ కూడా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. మాదిగలను కాంగ్రెస్ పార్టీ కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నదని విమర్శించారు.

టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు

రామవరం, ఏప్రిల్ 7: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు కాపు కృష్ణ, కూసన వీరభద్రం ఆదివారం రామవరంలోని ఏరియా కార్యాలయంలో నిర్వహించారు. గడప రాజయ్య, ఆంజనేయులు, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, తిరుపతి, సూరిబాబు, గణేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రి సీజ్

సారపాక, ఏప్రిల్ 7: సారపాకలోని ప్రైవేటు ఆసుపత్రిని డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష శనివారం రాత్రి తనిఖీ చేశారు. యాజమాన్యం వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో ఆసుపత్రిని సీజ్ చేశారు. గతంలో తనిఖీ చేసినప్పుడు ధ్రువపత్రాలు లేకపోవడంతో షోకాజ్ నోటీస్ ఇచ్చినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టేకులపల్లి, ఏప్రిల్ 7: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యకిత చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. బోడు ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోడు పోలీస్‌స్టేషన్ పరిధి కిష్టారం గ్రామానికి చెందిన బొల్లి లక్ష్మయ్య (33) ఈ నెల 4న కొప్పురాయి పంచాయతీ కొత్తూరు వస్తుండగా కేవోసి సమీపాన బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికుల సహాయంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

బెల్టు దుకాణాలపై దాడులు

అశ్వారావుపేట, ఏప్రిల్ 7: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎక్సైజ్, పోలీస్ అధికారులు ఆదివారం సంయుక్తంగా బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. మండలంలోని ఆసుపాక, నారంవారిగూడెం గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎల్.కృష్ణ నేతృత్వంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించి రూ.26 వేల విలువ గల మద్యం సీసాలను స్వాదీనం చేసున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

అశ్వారావుపేట, ఏప్రిల్ 7: లారీని నిర్లక్ష్యంగా నడిపి మరో లారీ ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ నుంచి గ్రానైట్ రాళ్ళతో కాకినాడ వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చే మరో లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పి రహదారి ప్రక్క చెట్టును ఢీకొట్టింది. సమాచారం అందుకున్న బ్లూకోట్ కానిస్టేబుల్స్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బ్లూకోట్ సిబ్బంది ఫిర్యాదు మేరకు లారీని నిర్లక్ష్యంగా నడిపిన మహబూబ్‌నగర్ జిల్లా చిన్న గూడూరుకు చెందిన డ్రైవర్ సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీరాముల శ్రీను తెలిపారు.

వడదెబ్బకు మేకల కాపరి మృతి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 7: వదదెబ్బ తగిలి తీవ్ర అస్వస్థకు గురై మేకల కాపరి మరణించిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకున్నది. మండలంలోని ముత్యాలగూడెం గ్రామానికి చెందిన చిన్నబాబు (58) మేకలు కాసేందుకు వెళ్లి తీవ్ర అస్వస్థకు గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, పుచ్చకాయల కమలాకర్, మేదరమట్ల వెంకట రామనర్సయ్య, గ్రామస్తులు చిన్నబాబు మృతదేహాన్ని సందర్శించి, నివాళి అర్పించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 7: మండలంలో ఇల్లెందు క్రాస్ రోడ్ ప్రధాన రహదారి పక్కన ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసులు తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 7: తిరుమలాయపాలెం ఇటుక బట్టీలో ఆదివారం కూలీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాయపాలెం ఇటుక బట్టీలో ఏపీలోని కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన తాళ్లూరి జమలయ్య, ధనమ్మ దంపతులు కూలీ పనిచేసుకుంటూ ఇక్కడే ఉంటున్నారు. భార్యభర్తల మధ్య కుటుంబ తగాదాల నేపథ్యంలో జమలయ్య (58) పురుగుమందు తాగాడు. జమలయ్యను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర కు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపా రు.

గడ్డివాము దగ్ధం

కొణిజర్ల, ఏప్రిల్ 7: మండల పరిధిలోని పల్లిపాడులో షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధమైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. పల్లిపాడుకు చెందిన బయ్యారపు నరసింహారావు గడ్డివాము షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది.